క్లుప్తంగా

మూడు రోజులుగా మీసేవ సర్వీస్‌లు బంద్



కేటీదొడ్డి: ఆన్‌లైన్ సేవలకు నిలయమైన మీసేవ సర్వీసులు నిలిచిపోయాయి. మూడు రోజులుగా పనిచేయడం లేదు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా మీసేవలో కొన్ని సేవలను చేర్చుతూ దాని కోసం సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కార్యక్రమం చేపట్టింది. దాంతో ఈ నెల 10 నుంచి మీసేవలు బంద్ అయ్యాయి. సర్వీస్ సేవలను యాడ్ చేస్తుండటంతో లాగిన్‌లో ఎర్రర్ అని వస్తుంది. మీసేవల ద్వారా జరిగే కార్యకలాపాలకు తీవ్ర విఘాతం కలుగుతుంది. ప్రధానంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, ఎడ్యుకేషన్‌లకు విఘాతం కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం మీసేవల ద్వారా 9 రకాల పత్రాలకు సంబంధించిన వివరాలను మీసేవ ఆన్‌బోర్డులో ఉంచేందుకు భూ పరిపాలన శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు సర్వర్ అప్‌డేట్ పూర్తయితే కానీ సేవలు పునఃప్రారంభం అయ్యే అవకాశాలు లేవని తెలియజేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహం



అయిజ: ఆగ్రాలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించిన జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో మున్సిపాలిటీలోని లయోలా స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని కావ్య కాంస్య పతకాన్ని గెలుచుకుంది. అదేవిధంగా 1వ తరగతి చదువుతున్న అభినవ్ పార్టిసిపేటింగ్ సర్టిఫికెట్ పొందాడు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ప్రిన్సిపాల్ సాలి, పీఈటీ క్రాంతికుమార్, మాస్టర్ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ వితరణ



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన శ్రీరాములు విద్యుత్ శాఖలో ఆర్టిజన్‌గా విధులు నిర్వహిస్తూ.. నాలుగు నెలల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. అయితే అప్పటి నుంచి కుటుంబ ఆర్థిక సమస్యలతో సతమతమవుతుండగా.. శ్రీరాములు కుమార్తె విజయలక్ష్మి హైదరాబాద్‌లోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ థర్డ్‌యియర్ చదువుతుంది. అందుకు ల్యాప్‌ట్యాప్ అవసరం ఉందని, సహకరించాలని సోషల్ రెస్పాన్సిబులిటీ బృందాన్ని కోరింది. విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు శుక్రవారం జిల్లా కేంద్రంలో డాక్టర్ శ్యాం చేతుల మీదుగా విద్యార్థిని విజయలక్ష్మికి ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కార్యక్రమంలో అశోక్, సలీం, ప్రసాద్, నగేష్, సంజీవ్, శ్యామ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు రక్షణేది?



ధూప, దీప నైవేద్యాలకు నోచుకోని జూలెకల్ ఈశ్వరస్వామి దేవాలయం

- ధూప, దీప నైవేద్యాలకు కేటాయించిన భూములు అన్యాక్రాంతం
- వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్, వడ్డేపల్లి, రామాపురం గ్రామాల్లో వెలుగు చూస్తున్న వైనం
- రికవరీ చేయాలని కోరుతున్న భక్తులు

శాంతినగర్: ఆలయాల భూములకు రక్షణతో పాటు ధూప, దీప నైవేద్యాలు కరువయ్యాయి. వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్, వడ్డేపల్లి, రామాపురం గ్రామాల్లో ఆయా దేవాలయాల పేరిట ధూప దీప నైవేద్యాలకు సుమారు 30 నుంచి వందల ఎకరాల భూములు ఏర్పాటు చేశారు. దేవాలయాలకు కేటాయించిన భూములను అర్చకులు సాగు చేసుకుంటూ ఆలయాలను సంరక్షించడంతో పాటు ఆలయాల్లో దేవుళ్లకు ధూప, దీప నైవేద్యాలు సమర్పించే వారు. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. దేవుళ్ల పేరిట, ఆలయాల పేరట ఉన్న భూములను అర్చకులు, ఇతరులు వారి పేర్లమీదికి మార్చుకుని కొందరు అమ్ముకోగా.. మరికొందరు కౌలుకు వేసుకుని ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ఆయా గ్రామాల ప్రజలు కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేసినా.. సమస్య పరిష్కారం కావడంలేదని, ఇప్పటికైనా రెవెన్యూ శాఖ, దేవాదాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్‌లో లింగమయ్య ఆలయానికి సంబంధించి సర్వే నంబర్ 160లో 22.39 ఎకరాలు, సర్వే నంబర్ 264లో 7.03, 317లో 15.18, 263లో 3.30, 389లో 7.02 ఎకరాలు 55 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి వుంది. మొత్తం భూమిలో సుమారు 20 ఎకరాల వరకు పూజారులు వారి సొంత పేరున మార్చుకుని అమ్ముకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని ఈశ్వరస్వామి దేవాలయానికి సంబంధించి 45 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఖిద్మతి ఇనాం ఉన్నప్పటికీ పూజారులు వారిపేరట పట్టా మార్చుకుని ఈశ్వరస్వామి పేరు లేకుండా చేశారని గ్రామస్తులు చెబుతున్నారు.
- వడ్డేపల్లి మున్సిపాలిటీలోని వసంతమాధవ స్వామి వారికి 130 ఎకరాల భూములు ఉన్నాయి. గట్టులో 100 ఎకరాలతో పాటు 30 ఎకరాల విలువైన భూములు శాంతినగర్ పరిసర ప్రాంతాల్లో ఉన్నాయి. శాంతినగర్‌లోని విలువైన భూములను కొందరు పూజారులు, ఇతరులు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకోవడమేగాక వేరే సర్వే నంబర్ భూములు ఇవే అని చూపి విక్రయించుకున్నారు.
- వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురంలో చెన్నకేశవస్వామి వారికి 50 ఎకరాలు, ఉభయరామలింగేశ్వర స్వామికి 70 ఎకరాలు, డోల్ మాన్యం 10, తాళం మాన్యం 4 ఎకరాలు, సొనాయి, సుత్తి కోసం నాయీబ్రాహ్మణులకు, నంబి, తమ్మళి కులస్తులకు శివాలయ పూజారులకు అప్పట్లో ఏర్పాటు చేశారు. గతంలో ఓఆర్సీ తీసుకుని అర్చకులు వారి పేరట మార్చుకుని ఉభయరామలింగేశ్వర స్వామికి సంబంధించిన 3 ఎకరాల తాళం మాన్యం, చెన్నకేశవస్వామి వారి 6 ఎకరాలు అర్చకులు మొత్తం 9 ఎకరాలు అమ్ముకున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

ధూప, దీపం పెట్టేలా చూడాలి..



మా గ్రామంలోని ఆలయాలకు వంద ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. ఆలయ భూములను కొందరు అమ్ముకున్నారు. మరికొందరు కౌలుకు వేసుకుని, రైతుబంధు, లోన్లు తీసుకుని లబ్ధిపొందుతున్నారు. ఆలయాల్లో మాత్రం ధూప, దీప నైవేద్యాలు పెట్టడంలేదు. మిగతా భూములను ఓఆర్సీ తెచ్చుకుని అమ్ముకుందామని చూస్తున్నారు.

– వెంకటేష్‌యాదవ్, జూలెకల్

విచారణ చేపడుతాం..



వడ్డేపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ఆలయాలకు సబంధించిన భూములు వివరాలు సేకరిస్తాం. రెవెన్యూ, దేవాదాయ శాఖల నిబంధనలకు విరుద్ధంగా ఏవైనా విక్రయాలు జరిపినట్లయితే అటువంటి వారిపై ఉన్నతాధికారులకు, దేవాదాయ శాఖ అధికారులకు నివేదికలు పంపుతాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– జోష్షి శ్రీనివాసశర్మ, తహసీల్దార్, వడ్డేపల్లి మండలం

గంగమ్మకు ప్రత్యేక పూజలు



చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎంపీపీ, గ్రామస్తులు

గట్టు: చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లో గ్రామస్తులు శుక్రవారం గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లో నీటి మట్టం క్రమంగా పెరుగుతూ, ఊరిలోకి చేరుకున్న తరుణంలో ప్రజలు ఆందోళన చెందుతూ భయంతో గ్రామాన్ని వదిలి వెళ్లారు. కొంత మంది పునరావాస కేంద్రంతో పాటుగా మరికొంత మంది వేరే ప్రాంతానికి తరలివెళ్లారు. దీంతో గ్రామస్తులు శాస్త్రోక్తంగా బ్రాహ్మణులతో గ్రామంలోకి రిజర్వాయర్ నీరు చేరుకున్న తరుణంలో పూజలు నిర్వహించారు. గంగాదేవి శాంతించి, అనుగ్రహం ప్రసాదించాలని పూజలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, గ్రామస్తులు హనుమంతురెడ్డి, శ్రీనివాసులు, వెంకన్న, శివన్న, తిమ్మారెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడిబయటి పిల్లలను బడికి పంపించాలి



బడిబయటి పిల్లలపై ఇంటింటికీ తిరిగిన హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు

కేటీదొడ్డి: బడిబయటి పిల్లలను బడికి పంపించాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. శుక్రవారం కొండాపురంలోని ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రతిఒక్క తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపించాలని, పిల్లలను చదివించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ యుగంధర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన ఎక్సైజ్‌మంత్రి జూపల్లి

ఎర్రవల్లి: తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయాన్ని ఇచ్చే ఆయిల్‌పాం సాగు విషయంలో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం బీచుపల్లి ఆయిల్ ఫెడ్ నర్సరీతో పాటు ఆయిల్ పాం సాగును ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ సంతోష్‌లతో కలిసి ఆయన సందర్శించారు. మొక్కల సేకరణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే రెండు నెలల్లో నర్సరీలో పెరిగిన మొక్కలన్నింటిని పొలాల్లో నాటించాలన్నారు. ఈసారి ఉద్యానశాఖ అధికారులతో కలిసి వ్యవసాయ, పట్టు పరిశ్రమ శాఖల సిబ్బందిని కూడా వినియోగించుకొని 4000 ఎకరాల్లో ఆయిల్ పాం తోటలను సాగు చేసేలా ప్రణాళిక చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఎకరానికి రూ.52వేల వరకు సబ్సిడీ ద్వారా అందిస్తుందని వివరించారు. జిల్లా అధికారి అక్బర్ అలీ, ఎస్పీ శ్రీనివాస రావు, నర్సరీ ఇంచార్జి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు ఘన స్వాగతం

ఎర్రవల్లి: మండల కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అలంపూర్ చౌరస్తాలో మార్కెట్‌యార్డు నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్తుండగా.. అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి ఆధ్వర్యంలో నాయకులు ఎర్రవల్లి కూడలిలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. సోమనాద్రి, ఎల్కూరు శ్రీను, వెంకటేష్, రాజ్‌కుమార్, బీసన్న, ఈదన్న పాల్గొన్నారు.

ఓటరు జాబితా విడుదల



కొండాపురం గ్రామపంచాయతీ వద్ద ఓటరు లిస్టును ప్రచురించిన పంచాయతీ కార్యదర్శి



అలంపూర్‌లో ఓటరు జాబితను విడుదల చేస్తున్న ఎంపీడీఓ పద్మావతి

- అభ్యంతరాలు తెలియజేయాలని కోరుతున్న అధికారులు

మల్దకల్/ ధరూరు/ అయిజ/ ఎర్రవల్లి/ మానవపాడు/ అలంపూర్ రూరల్/ కేటీదొడ్డి: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు కలెక్టర్ బీఎం సంతోష్ సూచన మేరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాను వార్డుల వారీగా విభజించి శుక్రవారం అధికారులు విడుదల చేశారు. వాటిని గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ఓటరు లిస్టును అతికించారు. ఓటర్ జాబితాలో ఎవరైనా తప్పులు గాని మార్పులు చేర్పులు ఉంటే ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు సంబంధిత పంచాయతీ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని సూచించారు. 19వ తేదీన ఉదయం 10 గంటలకు వివిధ రాజకీయపార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. చివరి ఓటర్ల జాబితా ఈ నెల 28న ప్రదర్శిస్తామన్నారు.

వర్గీకరణ త్వరగా జరిగేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు

అలంపూర్: ఎస్సీ వర్గీకరణ త్వరగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు కోరారు. అలంపూర్ చౌరస్తాలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లుగా పోరాటం చేసిందన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేసుకునే అధికారం ఇస్తూ.. తీర్పునిచ్చిందన్నారు. 70 ఏళ్లుగా వర్గీకరణ జరగకపోవడంతో మాదిగ ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలు అందక విద్య, ఉద్యోగం, ఆర్థిక, సామాజికంగా వెనుకబడ్డారన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ ఉపకులాలకు రిజర్వేషన్ వాట లభించేలా అధ్యాన కమిటీ న్యాయం చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జూన్‌లో చేపట్టిన టీజీఏఐఎంఎస్ సర్వేలో వెలుగులోకి వచ్చిన శిథిలావస్థకు చేరిన స్తంభాలు, చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ శివ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు జిల్లా కేంద్రంలోని పాతహౌసింగ్ బోర్డు, రాధాకృష్ణ కాలనీ, బీరెల్లి రోడ్డు, 2వ రైల్వేగేటు, వేణుకాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, మోమిన్‌మొహల్లా, రాఘవేంద్ర కాలనీ, బీసీ కాలనీ, శేరెల్లివీధి తదితర కాలనీలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు అలంపూర్‌లో..

అలంపూర్: అలంపూర్ చౌరస్తా, ఉండవెల్లి, మారమునగాల సబ్ స్టేషన్లలో మరమ్మతు చేపడుతున్న కారణంతో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ సయ్యద్ చిన్న మక్బుల్ ఒక ప్రకటనలో తెలియజేశారు. మానవపాడు, జల్లాపురం, శ్రీనగర్, శాంతినగర్, రామాపురం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, లైన్‌ల కింద పెరిగిన చెట్టు కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులకు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, అందుకు సహకరించాలని కోరారు.

దాడి కేసులో ఇద్దరికి జైలు శిక్ష

గద్వాల క్రైం: వ్యవసాయ పొలంలో జరిగిన వివాదంలో వ్యక్తిపై దాడి చేసిన వ్యక్తులకు గద్వాల కోర్టు అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఉదయ్‌నాయక్ జైలు శిక్ష ఖరారు చేస్తూ.. తీర్పు వెల్లడించినట్లు ఆ కోర్టు ఏపీపీ రెంచల్ సంజాన జాషువ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గద్వాల మండలం మల్లపల్లికి చెందిన నాగరాజు వ్యవసాయ పొలం వద్ద అదే గ్రామానికి చెందిన గోపాల్, వెంకట్రాములు 2021 సంవత్సరంలో అకారణంగా గొడవ పడ్డారు. ఈ దాడుల్లో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా.. సాక్షుల వాఙ్మూలం అనంతరం గోపాల్‌కు 3 సంవత్సరాల జైలు శిక్ష, వెంకట్రాములకు సంవత్సరం జైలు శిక్ష ఖరారు చేసినట్లు తెలియజేశారు.

కోర్టులో 32 మందికి జరిమానా

ఉండవెల్లి: మండలంలో డ్రంకెన్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వ్యక్తులను కోర్టులో హాజరు పరచగా 32 మందికి జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 26 మందిని కోర్టులో జడ్జి కవితా ఎదుట హాజరు పరచగా.. వారికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున రూ.26 వేలు, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున రూ.12 వేలు మొత్తం రూ.38 వేలు జరిమానా విధించినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలియజేశారు.

పాలన చేతకాక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై దాడులు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు హనుమంతు నాయిడు



అయిజ పోలీస్ స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు

గద్వాల అర్బన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాక బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులు చేయడం దుర్మార్గమని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతు నాయుడు, బీఆర్‌ఎస్‌వీ జిల్లా కో–ఆర్డినేటర్ కుర్వపల్లయ్య అన్నారు. బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేయడం సరికాదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్తున్న బీఆర్‌ఎస్‌వీ జిల్లా కో–ఆర్డినేటర్ కుర్వపల్లయ్యను పోలీసులు జిల్లా కేంద్రంలోని మెలచేర్వు రోడ్డులో అడ్డుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బాసు హనుమంతు నాయుడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని విమర్శించారు. సమావేశంలో బస్వరాజ్, రాజు నాయుడు, లోకేష్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

అయిజ: బీఆర్‌ఎస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మల్లికార్జున్‌లను పోలీసులు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. మాజీ మంత్రి హరీశ్‌రావును అరెస్ట్ చేసిన సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఆటకం కలుగకూడదనే ఉద్దేశంతో పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసినట్లు స్థానిక పోలీసులు తెలియజేశారు.

ఏచూరి ఆశయాలు కొనసాగిద్దాం



అలంపూర్‌లో ఏచూరికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

అలంపూర్: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు, రేపల్లె దేవదాసు అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సీతారం ఏచూరి సంతాప సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యుడు మాట్లాడారు. ఏచూరి మరణం లెఫ్ట్ పార్టీల ఉద్యమాలకు, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటన్నారు. దేశం అత్యున్నతమైన మేధావిని పోరాట యోధుడిని కమ్యూనిస్టునులు కోల్పోయారన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కోసం సీతారాం ఏచూరి ముఖ్యమైన పాత్ర పోషించారన్నారు. విద్యార్థి దశలోని జేఎన్‌యూ అధ్యక్షుడిగా ఎన్నికై ఉద్యమాలు చేశారన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా అందరిని సంఘటితం చేసిన మహోన్నత వ్యక్తిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, నాగరాజు, అయప్ప, ఆశన్న, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఏకదంతాయ నమోనమః



గద్వాల ఆకార్ యూత్ మండపంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



శాంతినగర్‌లో హోమం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ/ గద్వాలటౌన్: విఘ్నాలు తొలగించే వినాయకుడిని ప్రసన్నం చేసుకునేందుకు భక్తులు రోజుకో పద్ధతిలో పూజలు నిర్వహిస్తూ అందరిని ఆకట్టుకుంటున్నారు. నిత్యం రెండు పూటలు ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండపాల వద్ద సందడి కొనసాగుతుంది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు వినాయకుడి మండపాల వద్ద ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 23వార్డులోని కౌన్సిలర్ అనిత నర్సింహులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని సన్నిధిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చింతలపేట కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాదం ప్రారంభించారు.

లక్ష్మీ వినాయక హోమం

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని రాజోళి రోడ్డు సమీపంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం ఎదుట శుక్రవారం లక్ష్మీ వినాయక హోమం నిర్వహించారు. ఏకదంత బీవైఎంఆర్ యూత్ ఆధ్వర్యంలో బ్రాహ్మణులు తిరుమలరావు, వరప్రసాద్ మంత్రోచ్ఛరణల మధ్య భక్తులు, మహిళలు పాల్గొని హోమం చేశారు. కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పాల్గొని హోమంతో పాటు, వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు భార్గవ్‌యాదవ్, మహిపాల్‌రెడ్డి, బషీర్, భాస్కర్‌గౌడ్ తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు.



గద్వాల 23వ వార్డులో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

మండపం వద్ద అన్నదానం

గట్టు: గట్టులోని సంత బజారులో లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని వినాయక మండపం వద్ద అన్నదానం నిర్వహించారు.

ఘనంగా నిమజ్జనం..

మానవపాడు: మండలంలోని నారాయణపురం, మానవపాడు గ్రామాల్లో శుక్రవారం వినాయకుడిని నిమజ్జనం చేశారు. 'జై బోలో గణేష్ మహరాజ్‌కి జై' అంటూ ఊరేగింపుగా తీసుకెళ్లారు.



గట్టులో అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు



గద్వాల చింతలపేట కాలనీలో..

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుదాం



బాల్యవివాహాలు జరిపించరాదని సూచిస్తూ.. అవగాహన కల్పిస్తున్న సోషల్ మొబిలైజర్ లత

శాంతినగర్: బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుదామని రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సోషల్ మొబిలైజర్ లత అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని తనగలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ మొబిలైజర్ మాట్లాడారు. బాలకార్మిక వ్యవస్థతో పాటు బాల్యవివాహాలు నిర్మూలించడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని సూచించారు. బాలలకు ఏదైనా ఆపద వస్తే 1098 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు గోపాల్, మురళీధర్‌గౌడ్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు విద్యార్థులు పాల్గొన్నారు.